

Happy Birthday
to our beloved leader
Sri Talasani Srinivas Yadav Garu
Minister for Animal Husbandry, Fisheries and Cinematography of Telangana
ABHISHEK
PICTURES
Signature
GRILLS
THE VEG BARBEQUE

క్లుప్తంగా...

ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు



తెలంగాణ భవన్ పక్కన కొనసాగుతున్న లింకు రోడ్డు నిర్మాణ పనులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10 నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం.12ను కలుపుతూ నిర్మిస్తున్న లింకు రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే కేన్సర్ ఆస్పత్రి వైపు నుంచి రోడ్ నెం. 12 జానారెడ్డి ఇంటి వైపుతో పాటు మినిస్టర్ క్వార్టర్స్ రోడ్డు వైపు వాహనాలు తేలికగా ముందుకు సాగుతాయి. మరో పది రోజుల్లో ఇక్కడ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

కారుణ్య నియామకాలు

వెంగళరావునగర్: ఉద్యోగం చేస్తూ మృతిచెందిన ఉద్యోగి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్‌లో కానిస్టేబుల్స్‌గా పని చేస్తూ ఎం.రాజేశ్వర్, డి.దశరథ్ ఇటీవల మృతిచెందారు. కారుణ్య నియామకాల కింద ఇరు కుటుంబాలకు చెందిన వారికి గురువారం ఉద్యోగాలు ఇచ్చారు. రాజేశ్వర్ భార్య కల్పనకు, దశరథ్ కుమారుడు మనోజ్‌కుమార్‌కు జూనియర్ అసిస్టెంట్స్‌గా నియమించారు. ఇందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను మురళీకృష్ణ వారికి అందజేశారు.

యాచకుడి హత్య

పంజగుట్ట: యాచకుడిని హత్యచేసిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... పంజగుట్ట బడా మజ్జిద్ వెనకబస్తీలో అనీల్ కుమార్(40), జ్యోతి దంపతులు నివాసముంటారు. వీరికి పిల్లలు లేకపోవడంతో ఒక బాబును పెంచుకుంటున్నారు. వీరితోపాటు అనీల్‌కుమార్ తండ్రి శివరాజ్ అందరూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంటారు. బుధవారం ఎప్పటిలానే భిక్షాటనకు వెళ్లిన వారు రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చారు. అనీల్‌కుమార్‌కు మద్యం తాగే అలవాటు ఉండటంతో అతను మాత్రం ఇంటికి రాలేదు. అర్ధరాత్రి 1:30 ప్రాంతంలో ఒకవ్యక్తి వచ్చి మసీద్ ప్రాంతంలో అనీల్‌కుమార్ ఎవరితోనో గొడవపడుతున్నాడని చెప్పడంతో జ్యోతి, శివరాజ్ అక్కడకు వెళ్లగా అప్పటికే అనీల్ రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే 108కి ఫోన్ చెయ్యగా వారు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించాడని వైద్యులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో అనుమానంగా తిరుగుతున్న శ్రీను అనే మరో యాచకున్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

బీజేపీ కార్యకర్తకు చేయూత



మహిళా కార్యకర్తకు టిఫిన్ బండిని అందిస్తున్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ కార్యకర్త స్వయం ఉపాధికి బీజేపీ నేతలు సహకరించారు. ఎర్రగడ్డ డివిజన్ నటరాజ్‌నగర్‌కు చెందిన మహిళా కార్యకర్తల లక్ష్మక్కకు జీవనోపాధికి టిఫిన్ బండిని తనవంతు సహాయంగా బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి అందించారు. కార్యక్రమంలో నేతలు లంకల దీపక్‌రెడ్డి, గంగరాజు, ప్రేమ్‌కుమర్, ప్రసన్న, కిలారి మనోహర్, ఇందిరా, శ్రీధర్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



నూతన్

వెంగళరావునగర్: విద్యార్థి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ఎ.కాళిదాస్ ఎల్లారెడ్డిగూడలోని కీర్తి అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తుంటాడు. అతనికి నూతన్ అనే 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. నూతన్ ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 2న నూతన్ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నూతన్ స్నేహితులు కొంతమంది తన ఇళ్లల్లో నుంచి రూ. 10 వేలు తీసుకుని వెళ్లారని ఆయన తెలుసుకున్నాడు. తన ఇంటికి వచ్చి సీసీ టీవీలో పరిశీలించగా తన కుమారుడు కూడా తన చొక్కా జేబులో ఉన్న రూ. 1200 తీసుకెళ్లినట్టుగా తెలిసింది. నూతన్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు బడుల్లో... అల్పాహార మెనూ

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం అల్పాహార పథకం ఈ నెల 6 నుంచి అమలుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్పాహార మెనూను ప్రారంభించనున్నారు. శనివారం నుంచి అన్ని పాఠశాలలకు ఈ అల్పాహారం పిల్లలకు అందించనున్నారు.

- నేడు ప్రారంభం.. రేపటి నుంచి చిన్నారులకు అందజేత
- ఖైరతాబాద్ జోన్‌లో 22 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం
- హాజరుశాతం పెంచడం, ఆకలి నివారించడం ముఖ్య ఉద్దేశం



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

బంజారాహిల్స్: పేద విద్యార్థులు ఉదయం ఎలాంటి ఆహారం తీసుకోకుండా పాఠశాలకు రావడం వల్ల వారు అనేక సమస్యలతో బాధపడుతున్నారని ఫలితంగా చదువులపై దృష్టి సారించలేకపోతున్నారని గుర్తించిన సీఎం పేద పిల్లల ఆకలి తీర్చేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు.

▲ ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్య విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. విరామ సమయంలో రాగి జావ, మధ్యాహ్నం ఎప్పటిలాగే మధ్యాహ్న భోజనం అందిస్తారు. అల్పాహారానికి సంబంధించిన మెనూలో ఇడ్లీలు, కిచిడీ, పాయసం తదితర రకాలు ఉన్నాయి.

▲ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, షేక్‌పేట, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు.

▲ అన్ని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న 22 వేల మంది విద్యార్థులందరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. పోషణ, హాజరు, విద్యలో ప్రగతి అనే మూడు అంశాలపై ఈ అల్పాహార పథకాన్ని ప్రవేశ పెడుతున్నారు.

▲ పిల్లల్లో పోషకాహార లోపం, తరగతి గదిలో ఆకలి నివారించడం, హాజరుశాతం పెంచడం, విద్యార్థుల ఆరోగ్యం, పెరుగుదల మెరుగుపర్చడం లక్ష్యంగా దీన్ని అమలు చేస్తున్నారు. మొబైల్ యాప్ ద్వారా ఈ పథకాన్ని పర్యవేక్షిస్తారు. స్థానికంగా వండిన వేడివేడి పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించనున్నారు. మరోవైపు తల్లిదండ్రులకు వంటభారం తగ్గించడమే దీని ముఖ్య ఉద్దేశం.

బీసీ బంధు చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న సోమాజిగూడ కార్పొరేటర్ సంగీతాయాదవ్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన 196 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. సోమాజిగూడ కార్పొరేటర్ సంగీతాయాదవ్, బీసీ వెల్ఫేర్ డీడీ ఆశన్నతో పాటు వివిధ డివిజన్ల బీఆర్ఎస్ నేతలు కార్యక్రమంలో పాల్గొని చెక్కులను పంపిణీ చేశారు. విడతల వారీగా బీసీ బంధు చెక్కులు పంపిణీ చేస్తున్నామని మంజూరైన ప్రతి ఒక్కరికీ పంపిణీ జరుగుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఆశన్న తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ తన వద్దకు వస్తున్న ప్రతి దరఖాస్తును తనకు అందజేస్తున్నారని ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరిని లబ్ధిదారులను చేస్తున్నారని వెల్లడించారు. రూ. లక్ష ఆర్థిక సాయంతో ఉపాధి ఏర్పర్చుకోవాలని సూచించారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ఎమ్మెల్యే వద్ద తమ దరఖాస్తులను అందజేయవచ్చని అక్కడి నుంచి తమకు సిఫారసు చేయబడతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు మామిడి నర్సింగ్‌రావు, అరుణ్‌కుమార్, మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్టు



చోరీ చేసిన ఆటోలతో రాజు

వెంగళరావునగర్: ఆటోలను దొంగతనం చేసిన ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రహమత్‌నగర్ డివిజన్ పరిధిలో ఉండే షానూజ్ గత నెల 30న కార్మికనగర్ సంతోషిమాత ఆలయం సమీపంలో తన అద్దె ఆటోను పార్కు చేసి ఉదయం వచ్చి చూడగా అతని ఆటో కనిపించలేదు. ఈ నెల 1న జడావత్ శ్రీను అనే వ్యక్తి తన సొంత ఆటోను సంతోషిమాత ఆలయం సమీపంలో పార్క్ చేశాడు. ఉదయం వచ్చి చూడగా అతని ఆటో కూడా కనిపించలేదు. దాంతో ఇద్దరూ వేర్వేరుగా మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఆటోలను జవహర్‌నగర్‌లో నివాసం ఉండే ఎం.రాజు, అతని స్నేహితుడు సాయి ప్రసాద్‌తో కలిసి దొంగతనం చేశారు. ఆటోలను అక్కడ నుంచి తరలించి ఎల్లారెడ్డిగూడలో ఉంచారు. ఈ విషయాన్ని వెస్ట్‌జోన్ పరిధిలోని (మధురానగర్ పీఎస్‌కు చెందిన) టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఒకడైన రాజు ఆటోలను పార్టులుగా విడగొట్టి విక్రయించడానికి ప్రయత్నించాడు. మాటువేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతనిని పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. అతని స్నేహితుడు సాయి ప్రసాద్ పరారీలో ఉన్నాడు. నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

కాంగ్రెస్ ఆరు హామీలు చరిత్రాత్మకం



అశోక్‌కాలనీలో అభయహస్తం కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా

సనత్‌నగర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలు చరిత్రలో నిలిచిపోతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. సనత్‌నగర్ డివిజన్ అశోక్‌కాలనీలో ఇంటింటికీ అభయహస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట నీలిమా మాట్లాడుతూ... మహిళలు ఆత్మాభిమానంతో బతకాలని, వారికి అనేక పథకాల అమలుపై కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పాలనలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. ఇంటింటికీ అభయహస్తం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు ఇబ్రహీం పటేల్, బబ్లు, నవాజ్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని తెలంగాణ గజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీ పాల) ఆవేదన వ్యక్తం చేసింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు 14 కొత్త కాలేజీలు ఏర్పాటు చేశారని తమకు అంతా మంచి జరిగిందని, ఏ సమస్య ఉన్నా నేరుగా కలిసి విన్నవించుకునే వారిమని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రెండు నిమిషాల అపాయింట్ కోసం 9 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నామన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు వై.నర్సయ్య గౌడ్, ప్రధానకార్యదర్శి డాక్టర్ కె.ఎస్.చక్రవర్తిలు మాట్లాడుతూ... రాష్ట్రంలో 56 కళాశాలలు ఉండగా అందులో 50 శాతం వరకు అధ్యాపకుల, నాన్‌టీచింగ్ ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కళాశాల భవనాలు చాలావరకు శిథిలావస్థలో ఉన్నాయని కనీస సదుపాయాలూ లేవన్నారు. గౌరవ సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు, వి.సురేష్, మురళీ మనోహర్ పాల్గొన్నారు.

బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ఉచిత రొమ్ము కేన్సర్ పరీక్షలు

బంజారాహిల్స్: ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ నెలను ప్రపంచ రొమ్ము కేన్సర్‌మాసంగా పాటిస్తారు. దీన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఉచిత రొమ్ము కేన్సర్ నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాడ్‌లైఫ్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నిర్వహిస్తారని కేన్సర్ నిర్ధారణకు సంబంధించిన ప్రాథమిక పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షల అనంతరం ఎవరికైనా మామోగ్రామ్ వంటి మరేదైనా వ్యాధి నిర్ధారణ పరీక్ష నిర్వహించాలని వైద్యులు నిర్ణయిస్తే వాటికి అయ్యే ఖర్చులో మామోగ్రామ్ 25 శాతం, ఇతర టెస్టులకు 10 శాతం తగ్గింపు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వివరాలకు ఫోన్: 040 2355 1235 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

యువకుడి అదృశ్యం



సయ్యద్ అక్రం

రహమత్‌నగర్: డెకరేషన్ చేసే ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్‌టీ నగర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ సమాచారం మేరకు... ఎస్ఆర్‌టీ నగర్‌లో నివాస ముండే సయ్యద్ అక్రం(23) డెకరేషన్ పని చేస్తుండేవాడు. వారం క్రితం బయటికి వెళ్లిన అక్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య ఫైజాబేగం బోరబండ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన ఎస్ఐ సర్దార్ జమాల్ దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

క్రీడాకారులకు కిట్స్ అందజేత

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు గురువారం కిట్స్‌ను పంపిణీ చేశారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ క్రీడాకారులకు కిట్స్‌ను అందించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ... ఔత్సాహికులైన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అధికారులు శ్రీనివాస్‌గౌడ్, కుమార్, కృష్ణ పాల్గొన్నారు.



కమలాపురి కాలనీలో చెత్తను తొలగించిన పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వ్యర్థాల తొలగింపు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని కమలాపురి కాలనీ రిచ్‌మండ్ స్కూల్‌కు వెళ్లేదారిలో ఇండియన్ బ్లాసమ్స్ హైస్కూల్ ముందు గత వారం రోజుల నుంచి చెత్తా చెదారం పేరుకుపోయి స్థానికంగా దుర్గంధం నెలకొంది. దుర్వాసనలతో స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెత్తా వ్యర్థాలు పేరుకుపోయిన దృశ్యాలను ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. సమస్యపై స్పందించిన సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి సంబంధిత పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా చేశారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లిన సిబ్బంది వ్యర్థాలను తరలించడంతో సమస్య మెరుగుపడింది.

పెండింగ్ పనులన్నీ పూర్తిచేస్తాం: మాగంటి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పెండింగ్ పనులను ఎన్నికల షెడ్యూల్‌లోపు పూర్తి చేసి నియోజకవర్గాన్ని ఆదర్శంగా చూపిస్తామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీ, శాలివాహననగర్, ఎల్లారెడ్డిగూడ, అంబేడ్కర్‌నగర్, సుభాష్‌నగర్‌లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎల్లారెడ్డిగూడ పీజేఆర్ కమ్యూనిటీహాల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ అప్పుఖాన్, తన్నుఖాన్, మధు, ఫయాజ్, సాదిక్, శివ, చినబాబు, మారుతి, సోను, పాపయ్య, కాలనీ సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెస్టారెంట్, బార్ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: రాష్ట్రంలోని రెస్టారెంట్, బార్ ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం పంజగుట్టలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్ గౌడ్, గౌరవ సలహాదారులు బాల్‌రాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డిలు విలేకరులతో మాట్లాడుతూ... బ్యాంకులకు సెలవు దినాలు ఎక్కువగా ఉన్నందున తమకు సరైన సమయానికి బ్యాంకు గ్యారెంటీ ఇవ్వలేకపోయారని, బ్యాంకు గ్యారెంటీకి 15 రోజుల సమయం ఇవ్వాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇటీవల ఎక్సైజ్ డిపార్టుమెంట్ వారు క్రాస్ చెకింగ్ అని బార్లలోకి వచ్చి తనిఖీచేశారని, ఆ సమయంలో బార్ల ప్లాన్ చూపించలేదని, వయిలేషన్ ఉందని కేసులు నమోదు చేశారని, లక్ష రూపాయలు పెనాలిటీ కట్టాలని స్టేషన్ ఆఫీసర్లు నోటీసులు ఇచ్చారని మొదటి తప్పుగా క్షమించి కేసులను క్లోజ్ చేయాలని కోరారు. తెలంగాణలో అన్ని జిల్లాల్లో వైన్‌షాపులు రాత్రి 10 గంటలకే బంద్ చేస్తారని హైదరాబాద్‌లో మాత్రం రాత్రి 11 గంటల వరకు అనుమతిచ్చారని హైదరాబాద్‌లో కూడా రాత్రి 10 గంటలకు బంద్‌చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యలు విన్న కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

డ్యూటీకి వెళ్లి వచ్చేలోగా చోరీ

వెంగళరావునగర్: డ్యూటీకి వెళ్లి వచ్చేలోగా రూములో దొంగతనం జరిగిన సంఘటన గురువారం మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నల్లగొండ జిల్లా హాలియా ప్రాంతానికి చెందిన టి.శ్రావణ్‌కుమార్ స్థానిక గురుద్వార్ గల్లీలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతని రూంలో సి.హెచ్.రాజ్‌కుమార్, కార్తీక్‌లు కూడా చదువుకోవడానికి అద్దెకు తీసుకున్నారు. ముగ్గురూ ఒకే రూములో ఉంటున్నారు. ఈ నెల 4న ఉదయం శ్రావణ్‌కుమార్ డ్యూటీకి వెళ్లాడు. కొంత సమయం తర్వాత తన రూంలోనే ఉంటున్న రాజ్‌కుమార్ నుంచి ఫోన్ వచ్చింది. రూము తాళాలు పగలకొట్టి ఉన్నాయని, గదంతా చిందరవందరగా ఉన్నట్టుగా తెలిపాడు. హుటాహుటిన తన గదికి వచ్చి చూడగా అంతా చిందరవందరగా ఉన్నాయి. రూములో ఉండాల్సిన తన 3 బ్లూటూత్ హెడ్‌సెట్స్, పేపర్ కింద దాచి ఉంచిన రూ. 5 వేలు మాయం అయ్యాయి. తన రూంలో ఉంటున్న రాజ్‌కుమార్, కార్తీక్‌లు కనిపించలేదు. చుట్టుపక్కల వారిని విచారించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దాంతో మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

‘సంక్షేమం’లో తెలంగాణ దేశానికే ఆదర్శం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను దేశంలోని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద 72 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ల కింద ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సొంత ఇల్లు లేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఉచితంగా ఇస్తూ సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నట్లు వివరించారు. కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎస్.శేషుకుమారి, ఆకుల రూప, అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో 1,203 మందికి ‘డబుల్’ ఇళ్లు



లాస్య నందితను కలిసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వాసులకు రికార్డు స్థాయిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కాయని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి జి.లాస్య నందిత అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి దుండిగల్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 1,205 మంది లబ్ధిదారులకు గురువారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు లాస్య నందితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సహకారంతోనే తాము డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నామని, తాజాగా ఆన్‌లైన్ డ్రాలో ఇళ్లు దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం లాస్య నందిత మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ పాటికే సుమారు వెయ్యి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి లబ్దదారులకు అందజేయడం జరిగిందన్నారు. తాజాగా ఆన్‌లైన్ ద్వారా మొత్తం 1,703 మంది కంటోన్మెంట్ వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కాయన్నారు. తొలి విడతో 200 మందికి, రెండో విడతలో 300 మందికి ఇళ్లు అందజేసినట్లు తెలిపారు. పేదల పక్షపాతి సీఎం కేసీఆర్ వల్లే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది డబుల్ బెడ్‌రూమ్ అందుకుంటున్నారని తెలిపారు. ఇవే కాకుండా పేదల సంక్షేమాన్ని కాంక్షిస్తూ అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేసీఆర్ వరుసగా మూడోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం బంగారు తెలంగాణ రూపుదిద్దుకోవడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, సీనియర్ నాయకులు నర్సింహ్మా ముదిరాజ్, అజయ్, మురళి యాదవ్, కిరణ్, నరేశ్, గజ్జెల గోపాల్, నారాయణ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇదేం లొల్లి గణేషా?



లడ్డూ ఉండటంతో గుడికి తాళం వేసిన దృశ్యం



లడ్డూ అందుకున్న ముత్యాలు కుటుంబ సభ్యులు (ఫైల్)

బస్తీలో లడ్డూ జగడం

బంజారాహిల్స్: బస్తీ మొత్తం ఒక చోట చేరింది... డప్పు చప్పుళ్ల మధ్య, డీజే హోరు మధ్య గణనాథుడి లడ్డూను వేలం పాట వేశారు. ఒకటంటే, రెండని, రెండంటే మూడంటూ బస్తీవాసులు ఉత్సాహంగా వేలంలో పాటలో పాల్గొన్నారు. కట్ చేస్తే... గత అయిదు పర్యాయాలు ఎవరైతే లడ్డూను దక్కించుకున్నారో వారే మళ్లీ ఈ సారి కూడా లడ్డూను అత్యధిక ధర పాడి కై వసం చేసుకున్నారు. బస్తీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు మేళ తాళాలతో, డప్పు చప్పుళ్లతో లడ్డూ పాడిన వ్యక్తికి సన్మానం చేసి, పూలు, శాలువాలు వేసి లడ్డూను అప్పగించారు. ఇక వినాయకుని నిమజ్జనం పూర్తయింది. ఎవరి బాటలో వారు వెళ్లారని అంతా అనుకున్నారు. కానీ ఇక్కడే లొల్లి మొదలైంది.

- కొనుగోలు చేసిన వ్యక్తికి బస్తీలో సొంతిల్లు కూడా లేదని ఆయన ప్రతిసారీ లడ్డూ ఎలా కొంటాడంటూ, అసలు కిరాయి ఇంట్లో ఉండే వ్యక్తి మన గుడిలోకి ఎలా వస్తాడని, ఎలా పెత్తనం చేస్తాడంటూ బస్తీలోని ఓ వ్యక్తి ఆరోపించడంతో మనస్తాపానికి గురైన లడ్డూ పొందిన వ్యక్తి ఆ లడ్డూను తీసుకొచ్చి గుడిలో పెట్టి వెళ్లిపోయాడు. ఇక షురూ అయింది పంచాయితీ... వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ డివిజన్ దుర్గా భవానీనగర్ బస్తీలోని ఈదమ్మ గుడిలో ప్రతి ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలు సంబరంగా నిర్వహిస్తారు. యేటికేడు ఈ గుడిలో లడ్డూ ధర పెరుగుతూనే ఉంది.
- ఒకసారి బస్తీలో అద్దెకుండే ముత్యాలు అనే వ్యక్తి లడ్డూను వేలంలో దక్కించుకున్నాడు. తనకు కలిసి వచ్చిందనే ఉద్దేశంతో ప్రతియేటా లడ్డూ వేలంలో పాల్గొంటూ లడ్డూను దక్కించుకుంటూ వున్నాడు. ఇదే తరహాలో మొన్నటి వేలంలో కూడా లడ్డూను రూ. 3.30 లక్షలకు పాడి దక్కించుకున్నాడు. కానీ బస్తీలోని ఓ వ్యక్తి తనను అవమానించాడని, కిరాయికి ఉండే వ్యక్తి సొంతిల్లు ఉన్న వారిపై పోటీకి ఎలా వస్తాడంటూ అనడంతో ముత్యాలు మనస్తాపానికి గురై లడ్డూను తీసుకొచ్చి ఈదమ్మ గుడిలో పెట్టాడు. గుడి పెద్దలు, బస్తీపెద్దలే తనకు న్యాయం చేయాలంటూ మొరపెట్టుకున్నాడు.
- ఈ పంచాయితీ ఎట్లా తెంపాలో తెలియక అటు బస్తీవాసులు, ఇటు గుడి పెద్దలు తలబాదుకుంటున్నారు. అద్దె ఇళ్లల్లో ఉండేవారిని ఇప్పుడు గుడికి రావొద్దంటున్నారని, రేప్పొద్దున బస్తీలో కూడా తిరగవద్దంటే ఎలా అని ముత్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మరోవైపు లడ్డూను ఎవరూ ఎత్తుకెళ్లకుండా అమ్మవారి గర్భగుడిలో లడ్డూను పెట్టి తాళం వేసి కాపలా కాయాల్సి వస్తున్నది గుడి కమిటీ వారికి. ఈ పంచాయితీ ఎప్పుడు సద్దుమణుగుతుందో ఆ ప్రసాదాన్ని ఎప్పుడు పంచుతారో అంటూ మరికొందరు బస్తీవాసులు ఎదురు చూస్తున్నారు. మొత్తానికి ముత్యాలు కొన్న లడ్డూ పంచాయితీ ఫిలింనగర్ బస్తీల్లో హాట్‌టాపిక్‌గా మారింది. దేవుడు కరుణించినా... బస్తీవాసుల కటాక్షం లేకనే లడ్డూ రాలేదంటూ సెటైర్లు వేస్తున్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో 2022–2023లో ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్‌లో 90 శాతం పైబడి మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థినీవిద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. గురువారం కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి నవంబర్ 4 వరకు పూర్తిచేసిన దరఖాస్తు ఫామ్‌లు కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 040–24658160, 9491627404. దూరప్రాంత విద్యార్థులకు వెబ్‌సైట్ www.mkvvftrurt.org నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

పద్మశాలీ విద్యార్థులకు..

అంబర్‌పేట: నియోజకవర్గం పద్మశాలీ సంఘం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పద్మశాలీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివకుమార్, కోశాధికారి అశోకుమార్‌లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, 2022–23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు ఈ ప్రతిభాభ పురస్కరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 10వ తేదీ లోగా సంప్రదించాల్సిన నంబర్లు 9391396698, 9652995589.

ఓటర్ల తుది జాబితా లోపభూయిష్టం

- ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు
- మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: రాష్ట్ర ఓటర్ల తుది జాబితా లోపభూయిష్టంగా ఉందంటూ సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఓటరు జాబితాలో జరిగిన లోపాలను వివరిస్తూ గురువారం ఆయన కమిషనర్‌కు ఈ–మెయిల్ పంపించారు. సనత్‌నగర్ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ నెంబర్ 211 పరిధిలో ఒకే అంతస్తులో ఉన్న ఎస్ఆర్‌టీ 765 ఇంట్లో 26 మంది ఓటర్లు ఉండడంపై తాను బీఎల్‌ఓ, ఈఆర్వో దృష్టికి తీసుకురావడం జరిగిందని ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి ప్రస్తావించారు. ఆ తర్వాత 26 మంది ఓటర్లలో తొమ్మిది మందిని ఆ ఇంట్లోనే ఓటర్లుగా ఉంచగా, మిగతా 17 మందిని నియోజకవర్గ పరిధిలోని ఇతర పోలింగ్ కేంద్రాలకు ఓటు హక్కును బదిలీ చేసినట్లు అధికారులు చెప్పారని వివరించారు. అయితే సదరు ఓటర్ల గురించి పోలింగ్ స్టేషన్ల వారీగా సమాచారాన్ని కోరగా ఇంతవరకు అందించలేదన్నారు. తదుపరి జరిగిన సమావేశంలో ఇదే విషయమై తాను ప్రశ్నించగా ఫారం–8 ఆధారంగా మార్పు చేసినట్లు ఈఆర్‌ఓ పేర్కొన్నట్లు తెలిపారు. అయితే సదరు ఫారాలను చూపించాల్సిందిగా అధికారులను అభ్యర్థించినప్పటికీ వారి వద్ద అందుబాటులో లేవని చెప్పారని వివరించారు. తుది జాబితాను పరిశీలించగా 211 పోలింగ్ బూత్ ఓటర్లకు సంబంధించి ఎలాంటి మార్పులు లేకుండా యధావిధిగా ఉండడం ఆశ్చర్యం కలిగిందన్నారు. సీఈఓ, యంత్రాంగం పనితీరును ఎన్నికల కమిషనర్ తీవ్రంగా పరిగణించాలన్నారు.

నేడు సీఎస్ఐఆర్–నీరి ఆధ్వర్యంలో జాతీయ వర్క్‌షాప్

లక్డీకాపూల్ : ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో పర్యావరణ సమస్యలపై దృష్టి సారించడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో వర్క్‌షాప్‌కు నగరం వేదికగా మారింది. సీఎస్ఐఆర్–నీరి హైదరాబాద్ జోనల్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని హోటల్ ది ప్లాజాలో నిర్వహించే ఈ వర్క్‌షాప్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న వివిధ పర్యావరణ సవాళ్లు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు సంబంధించిన పర్యావరణ సమస్యలను పరిష్కరించడానికి సాధ్యమయ్యే పరిష్కారాలను చర్చించనున్నది. ఇందుకు శాస్త్రవేత్తలు, నియంత్రణ అధికారులు, విధాన రూపకర్తలు, పారిశ్రామిక సిబ్బందిని ఒక ప్రత్యేక వేదికపైకి తీసుకురావడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యం. బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి. వెంకటరమణ, టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి శ్రీ కృష్ణ ఆదిత్య దివీస్ లేబొరేటరీస్ మాజీ డైరెక్టర్ దివి మధుసూదనరావు పాల్గొనే ఈ వర్క్‌షాపును సీఎస్ఐఆర్ హైదరాబాద్ జోనల్ సెంటర్ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ షేక్ బాషా ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించనున్నారు.